భారత్.. స్థూల ఆర్థికాభివృద్ధి

సంస్కరణల నేపథ్యంలో ఆర్థిక వృద్ధి వేగవంతమైనా.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా ఇటీవల ఆ వృద్ధి కొంత మందగించింది. అయితే జీడీపీలో 'పెట్టుబడి రేటు' పెరుగుదల.. రానున్న కాలంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ పూర్వవైభవం సాధించడానికి దోహదపడుతుంది. సంస్కరణల యుగంలో అనేక రంగాల్లో నియంత్రణ విధానాలు, విదేశీ మార్కెట్లపై తక్కువగా ఆధారపడటం, పెరుగుతున్న స్వదేశీ డిమాండ్ తదితర అంశాలు.. ఆర్థిక వ్యవస్థ తిరోగమన దిశ వైపు వెళ్లకుండా అధికవృద్ధి రేటు దిశగా అడుగులు వేయడానికి దోహదం చేయడంతోపాటు ఆర్థిక స్థిరత్వాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల వృద్ధికి మరింత అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలి.

జనాభా వృద్ధి, పెరుగుతున్న ఆదాయస్థాయి కారణంగా స్వదేశీ వినియోగం పెరిగి భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా రూపొందింది. ఆర్థిక వ్యవస్థ పరిమాణం, వృద్ధిరేటు పెరుగుదల, ఆర్థిక స్థిరత్వం, ఉత్పాదకత పెరుగుదల వల్ల ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. సంస్కరణలయుగంలో కేంద్ర ద్రవ్యలోటు తగ్గింది. దీంతోపాటు చెల్లింపుల శేషంలో లోటు, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కొవడం సాధ్యమైంది. ప్రైవేటు ఆర్థిక కార్యకలాపాల వృద్ధి కోసం కొన్ని కీలక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ యంత్రాంగానిది ప్రధాన పాత్ర. ప్రస్తుతం మన దేశం అనేక ఉత్పత్తులకు మార్కెట్‌లతోపాటు మూల ధనం, శ్రామికులు తదితర ఉత్పాదక కారకాలను కూడా కలిగి ఉంది. దేశంలో మార్కెట్ వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా తొలగకపోయినా... 1991-92లో ప్రవేశపెట్టిన నిర్మాణాత్మక సంస్కరణల ఫలితంగా మార్కెట్ వ్యవస్థ అంతకుముందు కంటే కొంత స్వేచ్ఛగా పని చేస్తోంది. ప్రస్తుత సంక్షోభ నేపథ్యంలో దేశంలో మందగించిన వృద్ధిని వేగవంతం చేయడానికి రిజర్వ్ బ్యాంక్ సరళీకృత ద్రవ్య విధానం.. ప్రభుత్వం వివిధ రంగాలకు ప్రకటించిన fiscal stimulus దోహదపడతాయి.



స్థూల దేశీయోత్పత్తి వృద్ధి - నిర్ణయించే కారకాలు:

దీర్ఘకాలంలో జీడీపీ వృద్ధిని మూడు ముఖ్యాంశాలు నిర్ణయిస్తాయి. అవి... 'లభ్యమయ్యే వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం''మానవ మూలధనం వంటి ఉత్పాదక వనరుల వినియోగం' 'సాంకేతిక ప్రగతి'.

- **పెట్టుబడి-జీడీపీ నిష్పత్తి:** జీడీపీలో పెట్టుబడి వాటా పెరిగిన పుడు ఆర్థిక వ్యవస్థలో మూలధన రాశి పెరుగుతుంది. ఫలితంగా ఉత్పాదకత పెరిగి మూలధన-శ్రామిక నిష్పత్తి పెరుగు తుంది.
- **జనాభా వృద్ధిరేటు:** దేశంలో అధికజనాభా వృద్ధిరేటు స్థిర మూలధన -ఉత్పత్తుల నిష్పత్తి తగ్గడానికి కారణమవుతుంది. దీంతో ఆర్థిక వ్యవస్థలో మూలధన సాంద్రత తగ్గుతుంది.
- వ్యాపార చక్రాలు, ప్రభుత్వ విధానాలు,ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థ పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం, openness of economy కూడా వృద్ధిరేటుపై ప్రభావాన్ని చూపిస్తాయి.

భారత్-స్థూల దేశీయోత్పత్తి వృద్ధి:

1980 వరకు మూడు దశాబ్దాల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ 3.5 శాతం సగటు వృద్ధిని సాధించింది. తర్వాత 1980-2000 మధ్య సగటున 5.5 శాతం వృద్ధి నమోదు చేసుకుంది. 1980లలో ఆర్థిక వ్యవస్థ వేగవంతమవడానికి అవలంభించిన విస్తరణ కోశ విధానం,ఈ దశకం మధ్యలో ప్రవేశపెట్టిన కొద్దిపాటి సంస్కరణలే కారణం. కానీ వాణిజ్యం, పారిశ్రామిక కార్యకలాపాలపై నియంత్రణలు కొనసాగాయి. ద్రవ్యలోటు అధికమై 1991 లో గల్ఫ్ యుద్ధం, అంతర్జాతీయ చమురు ధరల్లో పెరుగుదల వంటి కారణాలతో వ్యాపార చెల్లింపుల శేషంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది.

సంస్కరణలు ప్రారంభమయ్యాక 1995-96 నుంచి 97-98 మధ్య సగటు వృద్ధి 7.5 శాతం. కాగా 2003-04 నుంచి 2006-07 మధ్య 8.5 శాతం వృద్ధి సాధ్యమైంది. పదో పంచవర్ష ప్రణాళికలో 8 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్ణయించగా 7.6శాతం మాత్రమే నమోదైంది. తలసరి జీడీపీ వృద్ధి ఈ ప్రణాళికలో 6 శాతానికి పెరిగింది. సంస్కరణల యుగం స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని చవిచూసింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గడం, వినిమయరేటు స్థిరత్వం, విదేశీమారకద్రవ్య నిల్వలు,

ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల వంటి పరిణామాలు సంభవించాయి. ఆదాయ పెరుగుదలకు సంబంధించి ప్రపంచంలో చక్కని పురోగతి సాధిస్తున్న దేశంగా భారత్ నిలిచింది.

2008-09లో Advanced Estimates ప్రకారం ఉత్పత్తి కారకాల పంపిణీ దృష్ట్యా స్థూల దేశీయోత్పత్తి (GDP at factor cost) వద్ద జాతీయాదాయం రూ.49,89,804 కోట్లు. ఈ మొత్తంలో ప్రాథమిక రంగ వాటా (వ్యవసాయం, అడవులు, చేపల పెంపకం) 17.56 శాతం కాగా ద్వితీయ రంగం (మైనింగ్ అండ్ క్వారీయింగ్, తయారీ రంగం, విద్యుత్, గ్యాస్, వాటర్ సప్లై, నిర్మాణరంగం) వాటా 28.99 శాతం, తృతీయరంగం (వాణి జ్యం, రవాణా, కమ్యూనికేషన్, రియల్ ఎస్టేట్, సర్వీసులు) వాటా 54.45 శాతం.

తోడ్పాటుకు అవకాశాలు:

జాతీయాదాయం పెంపు దిశగా వివిధ రంగాల్లో తోడ్పాటుకు అనేక అవకాశాలు లభించాయి. వాస్తవానికి 1980లలో వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం, సంస్కరణల అమలు కాలంలో, వృద్ధి స్తంభించడం వంటి పరిస్థితులు ఈ రంగం వాటా జీడీపీలో తగ్గడానికి కారణం. చాంద్ అభిప్రాయంలో గ్రామీణ రోడ్లు, మార్కెట్లు, నిల్వ సౌకర్యం, గ్రామీణ విద్యుద్దీ కరణ లాంటి వాటిపై పెట్టుబడులు ఎక్కువగా ఉండాలి. దేశంలో భిన్నమైన వాతావరణం, soil conditions అధిక ఉద్యోగిత సాంద్రతతో కూడుకున్న తోటల పెంపకానికి అనుకూలంగా ఉంది. తోటల పెంపకాన్ని వ్యాపారంగా చేసి.. ఎగుమతుల పెంపు లక్ష్యానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే విద్యావంతులు ఆకర్షితులై వ్యవసాయ కార్యకలాపాల స్వభావాన్ని మార్చడానికి కారణమవుతారు. ఆధునిక అవస్థాపనలైన cold storages, గ్రేడింగ్, refrigerated transportation, quality controlకు ప్రాధాన్య మివ్వాలి.

వాణిజ్య సంస్కరణలు, పారిశ్రామిక రంగంలో నియంత్రణల తొలగింపు చర్యలు భారత పారిశ్రామిక వ్యవస్థలో అనేక మా ర్పులకు కారణమయ్యాయి. 1980లలో వృద్ధికి మూలధన వస్తు రంగం ఎంతో దోహదపడింది. దిగుమతి సుంకాలను తగ్గించి నప్పటికీ 1990లలో ఈ రంగంలో వృద్ధి తగ్గింది. ఇటీవల కాలంలో ఈ రంగంపై పెట్టుబడులు పెరగడంతో రానున్న కాలంలో పారిశ్రామికరంగ వృద్ధికి అనుకూల వాతావరణం కన్పిస్తుంది. అనశ్వర వినియోగ వస్తువులు (consumer durables) మంచి వృద్ధి సాధించడానికి ప్రజల వ్యయార్హ ఆదాయాలు (disposable incomes), పరపతి పెరగడం కారణమైంది. కాని తయారీరంగం వృద్ధి 1980 దశకం కంటే సంస్కరణల యుగం లో తగ్గింది. నిర్మాణ రంగం 2000-2005 మధ్య 8.2 శాతం సగటు వృద్ధి సాధించి 2008-09లో 8.7 శాతానికి పెరిగింది. పెట్టుబడులు పెరగడం, ప్రభుత్వ పెట్టుబడుల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే ఇందుకు కారణం. మూలధన వస్తు రంగం, తయారీరంగం, నిర్మాణరంగ వృద్ధికి అవసరమైన విధానాలు అవలంబించి... అధిక పారిశ్రామికీకరణ సాధనకు కృషిచేస్తే జీడీపీ వృద్ధి సాధ్యమవుతుంది.

సేవల రంగంలో వాణిజ్యం చాలా ముఖ్యమైన అంశం. జీడీపీలో దీని వాటా 1/7గా ఉండి సగటున 8 శాతం వృద్ధి సాధిస్తోంది. అదే విధంగా రవాణా రంగం, రియల్ ఎస్టేట్, వ్యక్తిగత సేవల వృద్ధిలోను పెరుగుదల నమోదవుతున్నాయి. ఫలితంగా జీడీపీలో సేవల రంగం వాటా పెరుగుదలకు ఈ రంగాలు దోహదపడుతున్నాయి. రైల్వే, బ్యాంకింగ్ రంగాలు సగటున 6 శాతం వృద్ధి సాధిస్తున్నాయి. సమీప భవిష్యత్‌లో స్టోరేజ్ రంగానికి ప్రాధాన్యమివ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా నిల్వ సదుపాయాల్ని పెంచాలి. జీడీపీలో వ్యవసాయరంగం వాటా తగ్గుతూ మిగతా రంగాల వాటా పెరగ డం వృద్ధికి చిహ్నంగా భావించవచ్చు.

వృద్ధికి ఆధారాలు - ఆర్థికవేత్తల అభిప్రాయాలు:

ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి కారకాల వినియోగం (సంఖ్య పరంగా) లేదా ఉత్పాదకత పెంచడం ద్వారా ఉత్పత్తి పెంచవచ్చు. అనేక ఆర్థిక వ్యవస్థల్లో ఆర్థిక వృద్ధి సాధనకు ఉత్పాదకత వృద్ధిని ముఖ్య ఆధారంగా గుర్తించారు. Dholakia, Evenson అభిప్రాయంలో హరిత విప్లవ కాలంలో వ్యవసాయ రంగం వృద్ధికి మొత్తం కారకాల ఉత్పాదకత (Total factor productivity) 40 నుంచి 50 శాతం తోడ్పడిందని భావించారు. 2004లో శివ సుబ్రమణియన్ అభిప్రాయంలో 1980వ దశకంలో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో కారకాల ఉత్పాదకత పెరగడం వల్ల వృద్ధి సాధ్యమైంది. ఇదే ధోరణి సంస్కరణల యుగంలోనూ కనిపించింది. కాళిరాజన్ (2000) అభిప్రాయంలో దేశం లోని అన్ని రాష్ట్రాల్లో 1985-95 మధ్య కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు Input utilisation(కారకాల వినియోగం) దోహద పడింది. 1985-90 నుంచి 1991-95 మధ్య ఉత్పత్తి వృద్ధికి సాంకేతిక ప్రగతి 20 నుంచి 35 శాతం తోడ్పాటును అందించింది. Virmani (2004) అభిప్రాయంలో.. దేశ జీడీపీలో సేవారంగం వాటా మిగతా దేశాల జీడీపీలో సేవా రంగం వాటా కంటే ఎక్కువగా ఉంది. అయితే అధిక ఉద్యోగిత కల్పన విషయంలో మాత్రం ఈ రంగం వెనుకబడింది.

ముఖ్యాంశాలు

- 10వ ప్రణాళికలో తలసరి స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 6 శాతం.
- 10వ ప్రణాళికలో స్థూల దేశీయ పొదుపు జీడీపీలో 31.4 శాతం.
- 2008-09లో స్థిర ధరల వద్ద తలసరి ఆదాయం రూ. 25,661.
- 2008-09 తలసరి ఆదాయ వృద్ధి 5.6 శాతం.
- 1980వ దశకంలో అధిక వృద్ధికి మూలధన వస్తురంగం చేయూతనిచ్చింది.
- భారత్‌లో తలసరి పాల లభ్యత 1980-81లో 128 గ్రాములు కాగా 2005-06లో 241 గ్రాములకు పెరిగింది.
- అనేక ఆర్థిక వ్యవస్థల్లో ఉత్పాదకత వృద్ధిని ఆర్థిక వృద్ధికి ముఖ్య ఆధారంగా గుర్తించారు.

- తూర్పు ఆసియా దేశాల కంటే భారత్‌లో పొదుపు, పెట్టుబడి రేట్లు తక్కువ.
- 2008-09లో Advanced Estimates ప్రకారం జీడీపీలో వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ వాటా ఎక్కువ.
- 2008-09లో జీడీపీలో తయారీ రంగం వాటా 16.02 శాతం.
- సంస్కరణల యుగంలో వినిమయరేటు స్థిరత్వం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గడం, విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరగడం వంటి పరిణామాలు సంభవించాయి.